


# డైనమైట్ రామాయణంలో చేపల వేట

నూరత్తు వేణుగోపాలరావు

నవంబర్ 1955. భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాగార్జునసాగర్ శంకుస్థాపన చేయటానికి రాబోతున్నారు. అది మన దేశచరిత్రలోనే ఒక మైలురాయి.

గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంటుగా పని చేస్తున్న నా మీద ప్రధాని కార్యక్రమానికి తగిన బందోబస్తు చేయవలసిన భారమంతా పడింది. ఒక్క రోజులో ఆయన రావటం, శంకుస్థాపన చేయటం, బౌద్ధ సాంస్కృతిక కేంద్రమైన నాగార్జునకొండ తిలకించటం, మాచర్ల నుండి గుంటూరుకి ఎనభై మైళ్ళు ప్రయాణం చేయటం (ఆ రోజుల్లో ప్రధానులు, ముఖ్యమంత్రులు

చీటికీ మాటికీ హెలికాప్టర్‌లో ఎగిరే వాళ్ళు కారు ) సాయంత్రం ఆరు గంటలకు గుంటూరులో అశేష ప్రజానీకాన్నీ ఉద్దేశించి బహిరంగ సభలో ఉపన్యసించటం ముఖ్య విశేషాలు. ప్రభుత్వం అవసరానికి అనుగుణంగా చతురంగ బలాలని అంటే, కాల్బలం ( పోలీసు జవానులు), వాహనబలం (జీపులు, వాన్‌లు వగైరా ), వార్తాబలం ( పోలీసుల ఆకాశవాణి), అంగబలం (రహస్య సమాచారాలు సేకరించడానికి గూఢచారులు) నాకు సమకూర్చి కట్టుదిట్టంగా ఏర్పాట్లు చెయ్యమని ఆదేశించింది. నెహ్రూ పండితుడు వేసే ఆ పునాది రాయి పైన నా నామధేయం స్వర్ణాక్షరాలతో లిఖింపబడక పోయినా, చారిత్రాత్మకమైన ఈ మహాసంఘటనలో నేనుకూడా ఒక కీలకపాత్ర ధరించానన్న సంతృప్తి నాకు చిరస్మరణీయం.

వచ్చిన చిక్కంతా ఏమిటంటే, ఈ కర్తవ్య నిర్వహణ నా కత్యంత భారంగా తోచింది. ఎనభై మైళ్ళ దూరంలో ఉన్న గుంటూరు, మాచర్లలో ఏకధాటిగా ఏర్పాట్లు చేసుకోవాలి. మందీ మార్బలం నిర్ణీత ప్రకారం పెట్టడమే కాకుండా వాళ్ళు తమ విధ్యుక్తధర్మాలని తు చ తప్పకుండా ఆచరించేట్లు చెయ్యాలి. నెహ్రూ దర్శనార్థం వచ్చే లక్షలాది ప్రజలని అదుపులో పెట్టాలి. ఏ అల్లర్లు ఆందోళనలు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వారం రోజులుగా రెండు వూళ్ళ మధ్య అవిరామంగా తిరుగుతూ అలిసిపోతున్నాను. నా పర్యవేక్షణలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ఏ విఘ్నమైన అంతరాయమూ రాకూడదని నా మనస్సులో ఆవేదన.

నా కింకో సమస్యకూడా వచ్చి పడింది. నేర పరిశోధనలో వెంకటస్వామి చూపిన చాతుర్యం వల్ల నేనే పూనుకుని అతన్ని ఒక మెట్టు పైకి ఎక్కించాను. ఇప్పుడా మహానుభావుడు మాచర్లలో సబ్‌ఇన్స్‌పెక్టరుగా ఉద్యోగం వెలగ బెడుతున్నాడు. స్వామి దొంగ సన్యాసులు అవులిస్తే పేగులు లెక్క పెట్టగల శక్తిమంతుడే కావచ్చు. హంతకులని, చోర గ్రేసర చక్రవర్తులని పట్టగల ధీమంతుడే కావచ్చు. కాని ఇంత జటిలమైన కార్యక్రమంలో చురుకుగా వ్యవహరించ గలడా అన్న భయం నన్ను వేధిస్తున్నది. అతడిని మాచర్లలో వేసి నన్ను నేనే ముప్పు తిప్పలు పెట్టుకున్నానేమో! కాని అప్పుడు నెహ్రూ అక్కడికి వస్తారని కలగన్నానా?

నెహ్రూ ఆగమనం ఇంకా మూడు రోజులే ఉంది. ఏర్పాట్లు సవ్యంగా జరిగిపోతున్నాయి. ఆనాడు మాచర్లలో పనులు ముగించుకుని గుంటూరు వచ్చేటప్పటికి రాత్రి ఎనిమిది అయింది. కారు ప్రయాణంతో అలిసి పోయాను. మా ఆవిడ భోజనం వడ్డిస్తూ "ఇలా నిద్రాహారాలు లేకుండా రాత్రింబవళ్ళు కారులోనే రోజులు గడిపితే మీ ఆరోగ్యం దెబ్బ తింటుంది. అయినా నాకు తెలియక అడుగుతానూ మీ ఒక్కరికేనా ఈ బాధ్యత? మీకు పై వాళ్ళు, కింద వాళ్ళు ఎవరూ లేరా? ఈ కార్యక్రమం అంతా మీ చేతుల మీదే జరుగుతుందా ఏమిటి?" అన్నది.

"ఉండకేం? అందరూ ఉన్నారు. పైవాళ్ళు పనులు పురమాయించేసి చేతులు దులుపుకుంటారు. కింద వాళ్ళు చూసీ చూడనట్లు, వినీ విననట్లు తప్పుకుంటూ ఉంటారు. ఈ ఉద్యోగం కత్తిమీద సాము వంటిది."

ఇంతలో ఆర్డర్లీ వచ్చి "తక్షణం అత్యంత ముఖ్యం" అని తాటికాయలంత అక్షరాల సందేశం తెచ్చి ఇచ్చాడు. అది విప్పి చూద్దాను గదా నా తల తిరిగి పోయింది. ప్రబంధ కాలంలో అయితే మూర్ఛ కూడా పోయేవాడినేమో! "నాగార్జున డామ్ దగ్గిర పది కిలో గ్రాముల డైనమైట్ దొంగిలించబడింది. నేరంలో అరాజక శక్తుల ప్రభావం ఎంత ఉందో తెలియటం లేదు. పై అధికారు లందరికీ తెలియ జేస్తున్నాను. వెంకటస్వామి."

నా మనస్సులో నానా విధమైన భయాలు, సంకోచాలు చెలరేగినాయి. ఇది స్వల్ప విషయం కాదు. డైనమైటు పరహస్తాల్లో పడటమే అపాయకరం. ప్రస్తుత పరిస్థితుల్లో పదికిలోల దాకా మాయమైపోయిందంటే ఎట్టి అవాంతర పరిస్థితుల్లోకి దారి తీస్తుందోనని మనస్సు పరిపరివిధాలా పోయింది. నెమ్మదిగా తేరుకుని ఆర్డర్లీతో "డ్రయివర్‌కితక్షణం కబురుచెయ్యి అర్జంటుగా మాచర్ల వెళ్ళాలి" అన్నాను.

నా భార్య నిశ్చేష్టురాలై పోయింది. "ఇదేమిటండీ, మీకేమైనా మతి పోయిందా? ఇంతగా ప్రయాణం చేసి వచ్చి మళ్ళీ వెంటనే బయలు దేరుతానంటారేమిటి? అర్ధరాత్రిలో అంకమ్మ శివాలన్నట్లు ఇప్పుడు వెళ్ళి చేసే దేముంది? పొద్దున్నే బయలుదేరి వెళ్ళచ్చు. ప్రస్తుతానికి రెస్టు తీసుకోండి" అని కార్యేషు మంత్రీ అన్న తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించేసింది.

ఇంతలో టెలిఫోను మోగింది. అందులోంచి వినపడింది ఐ. జీ. గారి మధుర కంఠస్వరం. "రావూ, ఈ డైనమైటు గొడ వేమిటయ్యా? ఇంత ఘోరమైన నేరం చేసిన వాళ్ళని ఈ పాటికి పట్టుకునే ఉంటా రనుకుంటాను."

"నాకూ వార్త ఇప్పుడే అందిందండి."

"అయితే మరి ఇంకా నీవు గుంటూరులోనే ఉన్నావేమిటి? మాచర్ల తక్షణం వెళ్ళాలనేది నీకు తట్టలేదా?" అని అధికార పూర్వకంగా అన్నాడు.

"అంతా అయోమయంగా ఉంది సార్. నేను ఇప్పుడే మాచర్ల నుండి వస్తున్నాను. ఈ విషయం పొద్దుటే వెళ్ళి విచారిస్తాను" అని సమాధాన పరచబోయాను.

దానితో ఆ మహానుభావుడు తారాజువ్వ లాగా ఎగిసి పడ్డాడు. "ఏమిటీ? నీకేమన్నా మతిపోయిందా? ( మా ఆవిడ అన్న మాటలే సుమండీ! ) ఇంకా పయం. మాచర్లంతా తగలబడి మసైపోయిన తరవాత వెళ్ళాలన్నావు కాదు. ఇది ప్రధానమంత్రి భద్రతా వ్యవహారానికి సంబంధించిన విషయమని మరిచిపోకు. ఒక్క క్షణంకూడా ఆలస్యం చెయ్యడానికి వీలులేదు. హుటాహుటిగా బయలుదేరి ఏ విధంగానైనా సరే ఈ కేసు పట్టుకోవాలి" అని రిసీవర్ (?) ఫోను పెట్టేశాడు.

పోలీసు వారి భార్యలకి భగవంతుడు పాము చెవులు ప్రసాదించాడు కాబోలు నాకూ ఐ.జీ. దొర గారికీ టెలిఫోనులో జరిగిన సంభాషణలోని అంతర్యమంతా మా ఆవిడగారు పూర్తిగా గ్రహించేసింది. "ఆ ముసలాడికేం? అక్కడ కూర్చుని ఎన్ని కబుర్లయినా చెప్పొచ్చు. మోసే వాడికి తెలుస్తుంది బరువు. ఏమైనా సరే, మీ రిప్పుడు వెళ్ళడానికి వీలులేదు. దేవుని దయవల్ల అంతా సవ్యంగానే జరుగుతుంది లెండి" అని 'కృష్ణతులాభారం'లో సత్యభామలా ధీరోదాత్తంగానూ ప్రాధేయ పూర్వకంగానూ సలహా ఇచ్చింది. ఇక్కడ "సలహా" అంటే ఆజ్ఞ అని అర్థం చేసుకోవలసిన అవసరం ఉందని ప్రాజ్ఞులందరికీ విదితమే కదా! నా అవస్థ అడకత్తెరస డ్డ పోక చెక్కలా అయిపోయింది. ఈ సందిగ్ధ సమయంలో కొత్తగా కాపరాని కొచ్చిన నా భార్యామనే గెలిచిందని వేరే చెప్పాలా?

• • • •

పొద్దున్నే ఎనిమిది గంటలకు మాచర్ల చేరుకున్నాను. ఏ దివ్య దృష్టి ఉందో, పూర్వ అనుభవం ప్రకారంనేను రెక్కలు కట్టుకుని వాల్తానసే నమ్మకం వలననో వెంకటస్వామి రహదారీ బంగళా దగ్గర హాజరుగా ఉన్నాడు. ఇంతటి ఉపద్రవమైన నేరం జరిగినా ఏ మాత్రం చలించినట్లు కనబడలేదు.

అసలు జరిగిన విషయం ఏమిటంటే రెండు రోజుల క్రితం రాత్రి అజ్ఞాత వ్యక్తులు ఎవరో డైనమైట్ గిడ్డంగి తాళాలు బద్దలు కొట్టి పది కిలోల దాకా అపహరించారు. ఆ డైనమైట్‌ని డామ్ నిర్మాణంలో కొండల్ని పగలగొట్టడం కోసం ఛీఫ్ ఇంజనీర్ కృష్ణావతారంగారు కాంట్రాక్టర్లకు అవసర ప్రకారం ఇచ్చిందే. దానిని జాగ్రత్తగా పరిరక్షించుకోవటంవినియోగించిన దానికంతా లెక్కలు చెప్పటం బాధ్యత కాంట్రాక్టర్ల మీదే ఉంటుంది.

కృష్ణారెడ్డి అనే ఆయన ఈ ప్రాజెక్టు మూలంగా పైకి వచ్చిన ప్రముఖుడు. రాజకీయంగా పెద్ద వాళ్ళతో సన్నిహిత సంబంధాలు ఉండటం వల్లనైతేనేం, ఇంజనీర్ల కటాక్ష వీక్షణాల వల్లనైతేనేం, స్వతహాగా తనకున్న తదితర చాకచక్యాల వల్లనైతేనేం ఆయన లక్షలు, కోట్లు ఆర్జించి ఆంధ్రసాహిత్యానికీ భారతీయ సంస్కృతికీ చందాలతో సన్మానాలతో ఇహమూ పరమూ సంపాదించాడు. ప్రస్తుతం ఆయన ఇంకా కొత్త కాంట్రాక్టు పంకిలాలలో నిలదొక్కుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడు. డైనమైట్ దొంగతనం జరిగింది ఆయన గిడ్డంగిలోనే.

కారు దిగీ దిగకుండానే నేను వెంకటస్వామిని ఉరిమి చూస్తూ "ఏమయ్యా అలా కళ్ళప్పగించి నిలబడ్డావు? ఏమైనా ఆచూకీ తీశావా లేదా?", అని గదమాయించాను.

వెంకటస్వామి ఆయాసంతో రొప్పుకుంటూ, "ఇంత పెద్ద కేసులో నే నెంత వాడిని సార్? ఇన్స్‌పెక్టరుగారు, డి. వై. ఎస్. పి. గారు పరిశోధిస్తున్నారు. కర్నూలు నుండి సి. ఐ. డి. తరపున సీతారాం హాఫ్స్‌గారుకూడా వస్తున్నారు. ఇప్పుడె వచ్చింది మెసేజి" అని నా చేతిలో పెట్టాడు.

ఇంతలో డిప్యూటీసూపర్నెంటూ ఇన్స్‌పెక్టరూ వచ్చారు. కేసులో తాము చేసిన ప్రయత్నాలూ,

4-1-84

పడిన ప్రయాసలూ చెప్పుకుంటూ పోతున్నారు. నేను వాళ్ళని కొంచెం ఆపి "ఇంతకీ ఆ కాంట్రాక్టరు ఏమంటున్నాడు?" అన్నాను.

"పాపం! ఆయన మాత్రంఏం చేస్తారు సార్? లబో దిబో మంటున్నాడు. ఇక్కడేఉన్నాడు. పిలిపించ మంటారా? తమరే ప్రత్యక్షంగా ప్రశ్నించవచ్చు" అన్నాడు డి. వై. ఎస్. పి బుంగ మీసాలు మెలి వేసుకుంటూ.

"అలాగే రమ్మనండి."

ఇంతలో కృష్ణారెడ్డి వచ్చాడు.

"అయ్యా, నాకు పరిచయం లేకపోయినా తమరిని గురించి మా మామగారు ఎప్పుడూ గొప్పగా చెపుతూ ఉంటారు" అంటూ కూర్చున్నాడు.

"దానికేమిలెండి! ప్రస్తుతం మేమూ, మీరూ చిక్కుల్లో పడ్డాం. ప్రభుత్వం ఇచ్చిన డైనమైట్‌ని పదిలంగా ఉంచుకోవలసిన బాధ్యత మీది. గిడ్డంగి తాళాలు బద్దలు కొట్టి అపహరించారంటే మీరు తగిన జాగ్రత తీసుకోనట్లేగా? గిడ్డంగికి కాపలా దారుని పెట్టలేదా?"

"పెట్టక పోవడ మేమిటి? కాని చిన్న పొరపాటు జరిగినందుకు తమరు క్షమించాలి. కాంట్రాక్టర్ల తరఫున ప్రధానమంత్రికి వెయ్యవలసిన పూల మాలకోసం కాపలాదారు వెంకయ్యని గుంటూరు పంపించాను. ఇంతలో ఈ అవాంతరం జరిగి పోయింది" అంటూ వాపోయాడు కృష్ణారెడ్డి.

నాకు ఒళ్ళు మండిపోయింది. "పెద్ద కాంట్రాక్ట్ తీసుకున్నావ్? పూల దండలు తేవడానికి నీకు వేరే మనిషి దొరకలేదా?" అని విసుక్కున్నాను.

కృష్ణారెడ్డి నమ్రతతో "వాడి తప్పేనండి. కాని తమరు అనవసరంగా గాభరా పడుతున్నారు. ఈ దొంగతనంలో ఏ అరాజక శక్తుల పాత్ర లేదని నా దృఢ నమ్మకం. ఆ కృష్ణ పరమాత్మ అనుగ్రహం వల్ల మన ప్రధానికి ఎటువంటి అపాయమూ ఉండదని నేను హామీ ఇస్తున్నాను" అన్నాడు.

చేసిన తప్పు కప్పిపుచ్చుకోవడానికి వీడు నాకు హామీ ఇస్తాడా? "చాల్లేవయ్యా—చెప్పొచ్చావ్! నీ భరతం తర్వాత పడతాం" అని పంపించేసి నేర పరి శోధనకి ఉపక్రమించాను.

ఈ తతంగంలో ప్రథమ కర్తవ్యం నేరం జరిగిన స్థలం చూడటం. కృష్ణారెడ్డి మందుగుండు సామాన్ల గిడ్డంగి వూరికి దూరంగా నిర్మానుష్య మైన చోట ఉంది. కాపలాదారు లేడన్న సంగతి చోరులు ముందే పసిగట్టి ఉండాలి. సాధారణమైన దొంగలే అయితే వాళ్ళు డైనమైటు తీసుకుని బావుకునే దేముంది? ఈ విషయంలో అరాజక వాదుల ప్రమేయం ఉండే ఉండాలి.

నా ఆలోచనల ప్రకారమే బుంగమీసాలరాయుడు కూడా "ఇందులో ఎటువంటి సందేహానికి ఆస్కారం లేదు, సార్. ఈ పని చేసింది తప్పకుండా అరాచక శక్తులే! ప్రధానమంత్రి వచ్చే సందర్భంలో ఏదో సంచలనం కలిగించాలని వాళ్ళు వేసుకున్న పథకంలా కనబడుతుంది. చాలా రోజులుగా కమ్యూనిస్టు నాయకులు నల్లకుంట రామయ్య, చివుము పర బ్రహ్మం అజ్ఞాతంగా ఉన్నారు. ఆ ఇద్దరూ ఈ




మధ్య పల్నాడులో తిరుగుతున్నారని వినికిడి. ఇది తప్పకుండా వాళ్ళ పనే అయి ఉంటుంది" అన్నాడు.

"అవును. నాకూ అలాగే అనిపిస్తూ ఉంది. వారిద్దరికోసం అన్వేషణ బలవత్తరం చేయండి. నాలుగు టీమ్లు తయారుచేసి పల్నాడు అంతా గాలిం చండి. మద్రాసునుంచి బాంబు స్క్వాడ్‌ని తక్షణం పంపమని వర్తమానం పంపించండి. ఎల్లుండి పొద్దుట ప్రధాని వచ్చే లోపల నేరస్థులని ఎలాగైనా పట్టుకోవాల్సిందే" అని ఆదేశాలిచ్చి వారిని పంపించేశాను.

● ● ● ●

గడియారంలో ముళ్ళతోపాటు నా మతికూడా చక్రభ్రమణం చేస్తోంది. ఎంత ఆలోచించినా డైన మైట్ దొంగతనం దుర్భేద్యమైన సమస్యగా ఉండి పోయింది. ప్రభుత్వం నుంచి ట్రంక్ కాల్సు విపరీత మైపోయాయి. ఏమీ చెప్పలేక, దిక్కుతోచక మనస్సు వికలమై పోయింది. రాత్రిపడింది. ఆ అలుముకుంటున్న అంధకారంలో ఒక చిన్న ఆశా కిరణం కూడా కనబడటం లేదు. నిస్పృహతో వరండాలో కూలబడిపోయాను. సరిగ్గా ఎనిమిది గంటలకి వెంకటస్వామి వచ్చాడు. వెలవెల పారుతున్న ఆ ముఖం చూడగానే అతడన్నా శుభవార్త తెస్తాడన్న ఆశకూడా అంతరించిపోయింది.

వెంకటస్వామి నెమ్మదిగా "దొరగారు నిద్రా హారాలు మాని చాలా మథనపడుతున్నారు. సమయం రావాలి. అదే కలిసివస్తే ఎంత కఠినమైన కేసు కూడా తేలిపోతుంది ... తమరికి భోజనం తెచ్చాను. బల్లమీద పెట్టించమంటారా?" అన్నాడు.

"ఏం భోజనమో! పై నుంచి వచ్చే దీవనలతోనే కడుపు నిండిపోతోంది. మళ్ళీ ఐ. జి. గారు ఫోను చేస్తే ఏం సమాధానం చెప్పాలో తోచడం లేదు."

"తమరే ఇలా అధైర్యపడిపోతే, ఇక మాలాంటి వాళ్ళ పంగ తేమిటి, సార్" అని వెంకటస్వామి ప్రశ్నించాడు. "తమరికి ఇష్టమని నేనే స్వయంగా ముదిగొండిదాకా వెళ్ళి మంచి మొయ్య చేప తెచ్చాను. చేపల కూర చేయుటంలో నా భార్యని మించినవాళ్ళు లేరు."

నాకు పట్టరాని కోపం వచ్చింది. "నీకు బుద్ధి లేదా? నాకోసం ఎవరూ వంటకాలు చేయవలసిన అవసరంలేదనీ, భోజనాలు పంపవద్దనీ ఎన్నిసార్లు చెప్పాను? హోటలు నుంచి క్యారియర్ తెస్తే సరి పోయేది ... అక్కర్లేదు—తీసుకుపో!" అని కేకలు వేశాను.

వెంకటస్వామి తన సహజ ధోరణిలో వణికిపోతూ "దొరగారూ, తమరి మనస్తత్వం నాకు తెలియదా? ఈసారికి మాత్రం నన్ను క్షమించండి. నాకు ఉద్యోగ భిక్ష పెట్టిన వారు తమరు. నా తృప్తికోసం చేశాను. ఒక్కసారి ఈ పేదవాడి ఆతిథ్యం స్వీకరించండి" అని ప్రాథేయపడ్డాడు.

నా కోపం కొంచెం చల్లారింది. "నువ్వు డైన మైట్ కేసు దర్యాప్తులో నీ శాయశక్తులు వినియో గించి ఏదో ఆచూకీ తెస్తావని ఎదురుచూస్తుంటే, ఎక్కడికో వెళ్ళి చేపలు తెచ్చావా? ఇదేనా నీ నిర్వాకం! అపరాధ పరిశోధనలోకన్నా చేపలు పట్టడంలో నీకు ఎక్కువ ప్రావీణ్యం ఉన్నట్లుంది" అని వెటకారంగా అన్నాను.

"నేను స్వతహాగా చేపలు పట్టలేదు, సార్. ముది గొండి వెళ్ళి, అక్కడి పల్లె పిల్లలకి ఒక రూపాయి ఇస్తే నదిలో టపాకాయలు పేల్చి ఫస్ట్‌క్లాస్ మొయ్యని బయటికి లాగారు."

ప్రపంచం తలక్రిందులైనా మానవమాత్రులం ఆహార పానీయాలు లేకుండా బ్రతకలేము కదా! వెంకట స్వామి తెచ్చిన చేపల కూర, ములక్కాయ సాంబారు నిజంగానే అద్భుతంగా ఉన్నాయి. నేనా మాట వెంకటస్వామికి చెబుదామని బయటికి వచ్చి చూస్తే అతడికి బదులు కర్నూలునుంచి వచ్చిన సి. ఐ. డి. అధిపతి నిరీక్షిస్తున్నాడు. అపరాధ పరిశోధనలో అగ్రగణ్యుడిగా చెలామణి అయ్యే ఆ అధికారి అసలు పేరు బొమ్మల సీతారాం. ఆయన్ని పరిశోధనా శాస్త్రంలో ఆధునిక విధానాలు నేర్చుకోవడానికి




ఒక పది రోజులపాటు ప్రభుత్వం స్కాట్లండు యార్డు పంపించింది. అప్పటినుంచి ఆయన్ని డిపార్టుమెంట్‌లో 'షెర్లాక్ హోమ్స్' అని పిలవటం ఆనవాయితీ అయిపోయింది. ఆయన కూడా ప్రజాభి ప్రాయాని కనుకూలంగా తన పేరు సీతారాం హోమ్స్ అని మార్చుకున్నాడు.

నన్ను చూడగానే హోమ్స్, "సార్, ఐ.జి. గారు చాలా చికాకుగా ఉన్నారు. ఈ కేస్ ఎలా అయినా ఛేదించాల్సిందే అని మీకు చెప్పమన్నారు" అని అన్నాడు.

"నాకూ చికాకుగానే ఉంది. మరి నా ఆర్తనాదం ఏమో చెప్పాడు? ఫ్రెండు నువ్వు వచ్చావు గదా? ఈ కేసు నీకు తక్షణమే అప్పగించేస్తాను. ఇన్ని విషయాల మధ్య అమూలాగ్రం పరిశోధన చేయటానికి ఉన్న పోలీసులకి తగినంత టైమూ లేదు, స్టామినా లేదు ..."

సీతారాం హోమ్స్‌గారి ముఖారవిందం నిజంగా షెర్లాక్ హోమ్స్ ముఖంలా కోలగా ఉంటుంది. ముక్కుతీరూ అంతే. ఒక్క పొగాకు పైపే తక్కువ. అది కూడా ఏ జేబులోనో పెట్టుకుని ఉంటాడు.

"అక్కర్లేదు! అంత అవసరం లేదు, సార్. ఈ రాత్రికి రాత్రి నేను మాత్రం చేయగలిగిన దేముంది? అది కాకుండా కర్నూలు నుంచి ఎలా ఉన్న వాళ్ళం అలాగే బయలుదేరి వచ్చాను. సరిగ్గా మంచినీళ్ళుకూడా తీసుకోలేదు. నాలుగు మెతుకులు తిని, కొంచెం రెస్టు తీసుకుంటే బాగుంటుంది. ఇటువంటి కేసుల్లో విజయం సాధించాలంటే మన మనస్సులు క్లియర్‌గా ఉండాలి. మీరు చెప్పినట్టు రేపు ఉదయం నుంచి పరిశోధన ప్రారంభిస్తాను—సెలవు" అంటూ [illegible]కున్నాడు.

ప్రఖ్యాత అపరాధ పరిశోధకుల తీరు ఇంతే కాబోలు. ప్రపంచం విరుచుకు పడుతున్నా, గోళ్ళు గిల్లుకుంటూ తమ మేధాశక్తితో ఎంత భయంకర మైన నేరాన్నికూడా అవలీలగా పట్టేస్తారు. ఈ హోమ్స్ మహాశయుడు—అంత మేధావియే కావచ్చు కాని, వచ్చిన వాడు తక్షణం రంగంలో దిగకుండా కేసు రేపు తీసుకుంటాడుట. అదీ కాకుండా 'నేను చెప్పినట్లు' అని ఒక మాటకూడా మలాగ్గా దొర్లించి పారేశాడు. ఇది విచిత్రమైన జగతి.

• • •

రాత్రి పది దాటిపోయింది. నిద్ర ముంచు కొస్తోంది. సమాచారం సేకరించడానికి వెళ్ళిన వాళ్ళు అయిపు లేకుండా పోయారు. దోమల బాధ పడలేక పడుకుందాం అనుకుంటుంటే, మళ్ళీ వెంకటస్వామి సాక్షాత్కరించాడు. అరెరే! ఎంత పొరపాటు! తమ సామర్థ్యంతో పట్టుకున్న మత్స్యరాజంతో భోజనం పెట్టినందుకు కృతజ్ఞత చెప్పనందుకు నేను విచారం వెలిబుచ్చాను. కాని నా మనోభావం తీరు తుందా? డైనమైట్ ఏ దుర్మార్గుల చేతుల్లో పడిందో! దాని వల్ల ఏ దుర్ఘటన జరుగబోతుందో!

వెంకటస్వామి సమయానుకూలంగా వేదాంత ధోరణిలో పడటం మామూలే. "దొరగారు చేయ వలసిన ప్రయత్నాలన్నీ చేశారు. 'విధి కర్మానుసారిణి' అన్నారు పెద్దలు. తప్పకుండా కృష్ణమ్మ తల్లి మనల్ని అనుగ్రహించక పోదు" అన్నాడు.

"వాళ్లే నీ శుష్క వేదాంతం! మంత్రాలకి చింతకాయలు రాలుతవటయ్యా! నాకు నిద్ర వస్తోంది— ఇక వెళ్ళు" అని కేకలు వేశాను.

"దొరగారూ, ఉద్యోగంలో ప్రవేశించినప్పటినుంచి మీ దగ్గిర పని చేశాను. కాబట్టి చనువు తీసు కుంటున్నందుకు ఆగ్రహించకండి. ఆ కృష్ణమ్మ తల్లే మన కీ విషమ పరిస్థితుల్లో దారి చూపిస్తుం దని నా కెందుకో అనిపిస్తోంది. ఈ కేసులో శ్రీ కృష్ణనామం క్షణం క్షణం చెవుల్లో గింగురు మంటుంది" అని అన్నాడు.

"అదెలాగోయ్?"

వెంకటస్వామి చేతులు నలుపుకుంటూ "తమరు వేణుగోపాల నామధేయులు. అంటే శ్రీకృష్ణుల వారే కదా! ఇక పోయిన డైనమైట్ కృష్ణారెడ్డి గారిది. ఆ డైనమైట్ ఇచ్చిన చీఫ్ ఇంజనీరుగారి పేరు కృష్ణావతారం. అన్నిటికంటే ముఖ్యమైన విషయం— ఈ దొంగతనం కృష్ణానది తీరాన్నే జరిగింది" అని ఉపన్యాస ధోరణిలో చెప్పాడు.

నాకు నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. వెంకట స్వామి పరిశోధనా చాతుర్యం ఇలాంటి మూఢనమ్మ కాల మీద ఆధారపడి ఉంటుందని నేను ఊహించ లేదు. చిరుకోపంతో తేరిపార చూశాను. ఇంతలో అకస్మాత్తుగా అతనిలో విచిత్రమైన మార్పు వచ్చింది. మేఘావృతమైన ఆకాశం విద్యుల్లత వల్ల క్షణకాలం కాంతివంతమైనట్లు, ఆ నల్లని ముఖంలో ఒక వెలుగు వెలిగింది. ఉద్వేగంతో "దొరగారూ,దొరగారూ! ఎంత పొరబాటైపోయింది! డైనమైట్ రహస్యం మన కళ్ళకి కట్టినట్లు కనబడు తున్నా చూడలేకపోయాము. ఇందులో కీలకమైన వ్యక్తి కాంట్రాక్టరు కృష్ణారెడ్డి తప్ప వే రెవరూ కారు. తమరు ఆజ్ఞాపిస్తే ఇప్పుడే ఆయన్ని హాజరుపెడ్తాను. పెద్దవాళ్ళ అండ ఉన్నవాడు కాబట్టి, నేనేమైనా అడిగితే తేలిగ్గా తోసి పుచ్చే స్తాడు. మీరు కనుక గట్టిగా దబాయిస్తే అతని పోయి, నిజం చెప్పక మానడు" అని అన్నాడు.

"అసలు సంగతి ఏమిటి, స్వామీ? ఒక పెద్ద మనిషిని నిర్బంధించి లేనిపోని అభాండాలు వేస్తే మనం చిక్కుల్లో పడ్తాం."

"అంతా తమరికి తరవాత మనవి చేస్తాను, సార్! ప్రస్తుతం వ్యవధి లేదు. ఆలస్యం అయిందంటే, చేజిక్కిన అవకాశం కాస్తా జారిపోతుంది. నన్ను నమ్మండి" అని ప్రాధేయపడ్డాడు.

వెంకటస్వామి ఏదోవిధంగా నన్ను ఇరకాటంలో పెడుతున్నాడు. కాని ఏం చేసేది? "సరేలే, తీసుకురా. ఇంతకీ నన్నే నాటకం ఆడమంటావ్?"

"ఏమీలేదు, సార్. మీ కంతా తెలిసిపోయినట్లే వ్యవహరించండి. ఆ తరవాత చూస్తారుగా తమాషా" అంటూ సెల్యూట్ చేసి గబగబా వెళ్ళిపోయాడు.

రాత్రి పన్నెండు గంటలకి ఇన్‌స్పెక్టర్, వెంకట స్వామి, కృష్ణారెడ్డితో సహా వచ్చారు. నేను కళ్ళు నలుపుకుంటూ బయటికి రావడమే తడవుగా కృష్ణారెడ్డి కొంచెం కోపంగా "సూపరెంటుగారూ, ఏమిటీ అన్యాయం! పోలీసులు మమ్మల్ని నిద్ర కూడా పోనియ్యరా!" అంటూ కుర్చీలో కూర్చొ బోయాడు.

వెంకటస్వామి అడ్డువచ్చి, "ఉండవయ్యా, రెడ్డి. దొరగారి ముందు కుర్చీలో కూర్చోవడానిక్కూడా అర్హత ఉండాలి. వారికి నీ సంగతంతా క్షుణ్ణంగా తెలిసిపోయిందిలే" అని గదమాయించాడు.

ఆ అదను చూసుకుని, నేను కూడా కృష్ణారెడ్డి వైపు తీక్షణంగా చూస్తూ "రెడ్డీ, నీ వ్యాపార మంతా తెలిసిపోయిందిలే—ఏం? అలా బెల్లం కొట్టిన రాయిలా చూస్తావ్" అని అన్నాను. నా ప్రక్కన ఉన్న ఇన్‌స్పెక్టర్ విస్మయంగా చూస్తున్నాడు. కాని రెడ్డిగారి ముఖ కవళికలు మాత్రం ఏవో భీతా వహలో పడినట్లున్నాయి. వెంకటస్వామి మళ్ళీ యథోచితంగా "రెడ్డీ, ఇవ్వాళతో నీ పని సరి. దొర గారి కాళ్ళమీద పడి, నిజమంతా చెప్పేయ్. ఏ మంత్రి



ఫోటో – బి. ప్రభాకర్

గారో విన్నాదుకుంటా రనుకుంటున్నావేమో? మా దొరగారు దేవుడే దిగి వచ్చి రికమెండేషన్ చేసినా వినే వారు కారు. వూ! చెప్పు'' అని గర్జించాడు.

కృష్ణారెడ్డి వాలకం చూస్తే, అతనికి డైన మైట్ వ్యవహారంతో ఏదో సంబంధం ఉన్నట్లు నాకూ గాఢంగా తోచింది. న్యాయాన్యాయ విచారణ తరవాత చూసుకోవచ్చు. ఏమాత్రం మెత్త బడినట్లు కనబడ్డా, కథ అడ్డం తిరుగుతుంది. అందుకని నేను ఇన్స్పెక్టరుతో ''వీడు మన కళ్ళ లోనే కారం జల్లడానికి ప్రయత్నించాడు. ఇంకా చూస్తారేం? వీణ్ణి అరెస్టుచేయండి. రేపు అర దండాలతో సహా మాచర్ల వీథుల్లో తిప్పిన తరవాతనే మేజిస్ట్రేట్ దగ్గిర హాజరు పరచండి'' అని ఆజ్ఞా పించాను.

ఆలా అన్నానో, లేదో వెంకటస్వామి కృష్ణారెడ్డికి సంకెళ్ళు వేసేసి ''చెప్పరా, ఇప్పుడైనా చెప్పు'' అని చెవులు గింగురుమనేటట్లు అరిచాడు.

దానితో కృష్ణారెడ్డిగారి గాంభీర్యం, అహంభావం తటాలున దిగిపోయాయి. ''తప్పయిపోయింది, సార్. అంతా ఆ తప్పుడు వెధవ గుమాస్తా సాంబయ్య వల్ల జరిగింది. ఎంతకాలంగా చేస్తున్నాడో, అడపా దడపా డైనమైట్ పుల్లల్ని కృష్ణ ఒడ్డున ఉన్న పూళ్ళలో పల్లెవాళ్ళకి అమ్ముతున్నాడు. ప్రధాన మంత్రి రాక సందర్భంలో మందు సామాను గిడ్డంగులన్నీ తనిఖీ చేయమని తమరు ఆజ్ఞాపించా రట. అందుకని నేను వెళ్ళి చూచుకొంటే పది కిలోల డైనమైట్ తక్కువగా ఉంది'' అన్నాడు.

వెంకటస్వామి ముందుకు వచ్చి ''ఆ సంగతి నువ్వు డైరెక్టుగా రిపోర్టు చేయవచ్చుగా? ఎవ్వడో తాళాలు బద్దలు కొట్టి దొంగతనం చేశాడన్న నాటకం ఎందుకు ఆడావ్? నీకూ ఈ దొంగ వ్యాపారంలో భాగం లేకపోలేదు'' అని గట్టిగా గదమాయించాడు.

గౌరవ పురస్కారంగా మర్యాదలు చేసి అడిగితే నేరస్థులు నిజం చెపుతారా? వూరుకుంటే ఇక లాభం లేదని నేనుకూడా ''వెంకటస్వామీ, ఇంకా చూస్తావేం? ఒకటి, రెండు పడితేనే కాని ఈ మహానుభావుడు నిజం చెప్పడు,'' అన్నాను.

దానితో వణికిపోతూ కృష్ణారెడ్డి ''అయ్యబాబోయ్! నన్నేమీ చేయకండి. అంతా చెప్పేస్తాను. సాంబయ్య మీద పోలీసులకు రిపోర్టు ఇద్దామనే అనుకున్నాను కాని, నా కాంట్రాక్టు కాస్తా రద్దుచేసి పారేస్తారు. అందుకనే తప్పుడు రిపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. ఇక మీ దయ'' అంటూ ఏడవటం మొదలుపెట్టాడు.

● ● ● ●

ఆ రాత్రికి రాత్రే కృష్ణారెడ్డిని, సాంబయ్యని అరెస్టుచేయడం, పల్లెల్లో సాంబయ్య అమ్మిన డైనమైట్ పుల్లల్ని దొరికినంతవరకూ సేకరించడం జరిగింది. తెల్లవారేసరికల్లా పరిశోధన అంతా పూర్తి అయిపోయినట్లే. ఆ సమాచారం రేడియో ద్వారా ఐ.జీ.కి, ప్రభుత్వానికి పంపించి, గుంటూరులో ఏర్పాట్లు పర్యవేక్షించడానికి బయలుదేరాను. కాని, నా మనస్సులో ఉన్న శంక తీరలేదు. అందరూ డైన మైట్ రహస్యాన్ని నా తెలివి తేటలతోనే భేదించి పారేశానని అనుకుంటూ అందలాని కెత్తుతున్నారు. కాని అసలు రహస్యం వెంకటస్వామి దగ్గరే ఉంది.

డ్రైవరు నా సామానులు కారులో పెడుతుంటే వెంకటస్వామిని లోపలికి రమ్మని కబురుచేశాను. అతని ముఖం జాజ్వల్యమానంగా వెలిగిపోతోందని వేరే చెప్పాలా! ''శభాష్, వెంకటస్వామీ! ను వ్వీ కేసులో సరిగ్గా శ్రద్ధ చూపించలేదని ఏవేవో అన్నాను. ఏమీ అనుకోకు. అది మన కలవాటేగా! ... అయితే ఈ కేసు ఏ అరాచకశక్తుల పని కాదని, కాంట్రాక్టరు, గుమాస్తా చేసిన దగుల్బాజీ తతంగమని ఎలా కను క్కున్నావు?'' అని అడిగాను.

''అంతా తమ చలవేనండి.''

''భలేవాడివే. ప్రతిదానికీ నా చలవే అంటావు. ఇప్పటికీ నా కంతా అయోమయంగానే ఉందినుమా!''

''దొరగారూ, ఈ కేసులో మనం ముఖ్యమైన ఆధారాలు చక్కగా కనబడుతున్నా గ్రహించలేక పోయాం. అసలు మొదట్లోనే కృష్ణారెడ్డి పప్పులో కాలు వేశాడు. డైనమైట్ పోవటం వల్ల తన కాంట్రాక్టుకి ముప్పు వస్తుందని ఏడ్చాడే కాని, ప్రధానమంత్రికి ఏ అపాయం లేదని ఢంకా బజా యించి చెప్పాడు ...''

''హాహా! అది నిజమే! ఇప్పుడు తలుచుకుంటే కృష్ణారెడ్డి వాలకం మొదటి నుంచీ అనుమానా స్పదంగానే ఉంది.''

''కాని అసలు సంగతి గ్రహించలేని మంద బుద్ధిని నేను, సార్. తమరే గనుక చేపలు పట్టడం సంగతి ఎత్తకపోతే మనం ఇంకా దాని తెన్నూ తెలియ కుండా కొట్టుమిట్టాడుతూనే ఉండేవాళ్ళం.''

నేను అదిరిపడ్డాను. ''చేపల కూరకి, డైనమైట్ చోరీకి సంబంధం ఏమిటోయ్? నువ్వెప్పుడూ ఇలా తోకా లేకుండా మాట్లాడుతుంటావు'' అని వెళ్ళిపోబోయాను.

వెంకటస్వామి నా ముందుకు వచ్చి ''ఒక్క క్షణం ఉండండి, దొరగారూ. అంతా విశదంగా చెబుతాను. నేను తమ కిష్టమని మంచి మొయ్యచేప తేవటానికి ముదిగొండి వెళ్ళానా? అక్కడి పల్లెవాళ్ళు ఏదో టపాకాయలు పేల్చి చేపలు పడుతున్నారంటే తొంద రలో ఆ సంగతే పట్టించుకోలేదు. అక్కడే నేను పెద్ద ధోకా తిన్నాను. తమరు మంత్రాలకి చింత కాయలు రాల్తాయా అన్నారు. అలాగే టపాకాయ లతో చేపలు పడ్తాయా అన్న సంశయం నాకు తోచలేదు. అది డైనమైటే అయ్యుండాలి. కొన్ని చోట్ల ఆ విధంగా చేపలు పట్టారని ఎక్కడో చూచాయగా విన్నాను. మీకు ముందుగా చెప్పక ఇబ్బంది పెట్టినందుకు క్షమించండి. బయట సీతారాం హోమ్స్‌గారు కేసు తనకి అప్పగించలేదని కారాలు మిరియాలు నూరుతున్నాడు. ఆయన్ని కొంచెం సముదాయించుకోవాలి.''

''పోనీలెద్దూ! హోమ్స్ సంగతి మన కెందుకు? నువ్వన్నట్లు కృష్ణమ్మ తల్లి కటాక్షం వల్ల దుర్భేద్య మనుకున్న కేసు అతి లాఘవంగా పట్టేశాం. ఇది అంతా నీవల్లనే కదా! కృష్ణమ్మ తల్లి ఆ మొయ్య చేపని నీకు ప్రసాదించకపోతే మనం కూడా దానితో పాటు నదిలో గిలగిలా కొట్టుకుంటూ ఉండేవాళ్ళమే. థాంక్స్.''

గుంటూరుకి తిరుగు ప్రయాణంలోని అలస టంతా నా సంతోషంలో మరిచిపోయాను. డైన మైట్ రహస్యం భేదించినందుకూ, భారత ప్రధాని భద్రత విషయంలో ఏ ప్రమాదమూ లేనందుకూ ఆ రాత్రి నాతోబాటు ఢిల్లీలోనూ, కర్నూలులోనూ పెద్దలంతా నిర్భయంగా గుండెల మీద చేతులు వేసుకొని ఆదమరిచి నిద్రపోయారు! ★